క్లుప్తంగా

అటవీ చెక్‌పోస్టు తనిఖీ



మద్యం బాటిల్ పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

రాపూరు: రాపూరు–చిట్వేలి మార్గం మధ్యలోని మదూరుపల్లి వద్ద ఉన్న అటవీ చెక్‌పోస్ట్‌ను బుధవారం నెల్లూరు డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా చెక్‌పోస్టును తనిఖీ చేశామన్నారు. అలాగే ఈ మార్గం మీదుగా వెళ్లే వాహనాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. రాపూరు నుంచి రాజంపేట వెళ్లే కారులో రెండు మద్యం బాటిళ్లు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అడవులను సంరక్షించే కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తుంటామన్నారు. ఆయన వెంట అటవీ సిబ్బంది సాయికృష్ణ, సాల్మన్‌రాజ్, షఫీ ఉన్నారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



పాలెంపాడులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2023–24 ఏడాదిగాను ఆనేపూడి, పాలెంపాడు, నెలబల్లి, నేలపట్టు, నెల్లూరుపల్లె, ఉచ్చూరు గ్రామాల్లో ఆరు సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇప్పటికే ఆనేపూడి గ్రామంలోని ఓ వీధిలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు వేశారు. అలాగే ప్రస్తుతం పాలెంపాడు గ్రామంలోని ఓ వీధిలో 250 మీటర్లు పొడవున రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు.

క్రికెట్ విజేత ఊటుకూరు జట్టు



బహుమతి అందుకుంటున్న ఊటుకూరుజట్టు

సైదాపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఊటుకూరులో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీల్లో ఊటుకూరు జట్టు విజేతగా నిలిచింది. దివంగత ఎం శ్రావణ్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. బుధవారం ఫైనల్స్‌లో తురిమెర్ల, ఊటుకూరు జట్లు తలపడ్డాయి. ఊటుకూరు జట్టు 20 ఓవర్లకు 120 పరుగులు సాధించగా తురిమెర్ల జట్టు 69 పరుగులకే ఆలౌట్ కావడంతో ఊటుకూరు జట్టు విజేతగా ప్రకటించారు. విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతి అందజేశారు.

మల్లాం ఆలయానికి చేరిన రాముని అక్షింతలు



అక్షింతలు అందుకుంటున్న అర్చకులు

చిట్టమూరు: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు బుధవారం మండలంలోని మల్లాంలో ఉన్న కామాక్షిదేవి, సమేత మార్కేండేశ్వర స్వామి ఆలయానికి చేరాయి. అర్చకులు వాటిని అందుకుని, ఆలయంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికీ అందజేస్తున్నట్లు ఆలయ ట్రస్టీ డీ శేషరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి గూడలి సుధీర్ శర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

చిట్టమూరు: మండలంలోని మొలకలపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రరెడ్డిని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి బుధవారం పరామర్శించారు. రవీంద్రరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసిన శ్యాంప్రసాద్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో శుక్రవారం నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కు ఎస్సీ, ఎస్టీ, బీసీలు వేలాదిగా తరలి రావాలని చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య పిలుపు నిచ్చారు. మండలంలోని వరగలి క్రాస్ వద్ద బుధ వారం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇందులో భాగంగా రాజకీయ పదవులతో పాటుగా ప్రజా ప్రతినిధులుగా ఉండేలా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, ఈ కార్యక్రమాన్ని వీక్షించడానికి ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు.

కండలేరులో 12.565 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.565 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరూ బాగుండాలి.. అందులో మనముండాలి

- ఘనంగా ఏటి పండుగ
- పాల్గొన్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- ఆటపాటలతో సందడి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: అందరూ బాగుండాలి.. అందులో మనముండాలి అనే సంస్కృతితో ప్రజలందరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం రెండోరోజు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిలివేటి స్వర్ణముఖినది తీరంలో జనసందోహంతో నిండిన ప్రజలకు అభివాదం చేసి, అనంతరం మాట్లాడారు. ప్రజలు ఆనవాయితీగా వస్తున్న పండుగలను బాగా జరుపుకుంటున్నట్లు కనిపిస్తుందని చెప్పారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉంటేనే పండుగలు జరుపుకోగలరని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనా విధానంతోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం చలాకీ చంటి బృందం ప్రదర్శించిన కార్యక్రమాలను తిలకించారు. ప్రత్యేక యాంకర్లు, మిమిక్రీ కళాకారులుతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

స్వర్ణముఖినది తీరంలో సందడి

ఏటి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు చిన్నాపెద్దల ఆటపాటలతో స్వర్ణముఖినది తీరమంతా సందడిగా మారింది. ఇంటి వద్ద నుంచి వెంట తీసుకుని వచ్చిన తినుబండారాలుతో కుటుంబాలతో కలిసి సందడి చేశారు. కబడ్డీ, వాలీబాల్, గాలిపటాలు ఎగురవేయడం, ఖోఖో, గొబ్బిళ్ల తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్న పిల్లల కేరింతలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కే రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఓ కిషోర్‌యాదవ్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ సిద్ధయ్య, డీ రవి, పీ నాగార్జున, ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఏ లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



వాలీబాల్ ఆడుతున్న యువత



గొబ్బిళ్లు తడుతున్న మహిళలు

వైభవంగా వనమహోత్సవం



రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న ఆదిలక్ష్మీదేవికి బుధవారం రాత్రి నందనవనంలో వనమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముక్కనుమ రోజున ఆదిలక్ష్మీదేవికి వనమహోత్సవం నిర్వహించడం ఈక్షేత్రం ఆచారమని దేవస్థాన ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి తెలిపారు. ఆదిలక్ష్మీదేవి ఉత్సవమూర్తిని పద్మపీఠంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభయమానంగా అలంకరించి, మేళతాళాలు మంగళవాయిద్యాలతో వేదమంత్రోచ్ఛారణల నడుమ నందనవనం(తోట)లోకి వేంచేపు చేసి, అక్కడ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆస్థానసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండలంలోని ఏరూరులోని శివగణేష్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన క్రికెట్ పోటీల్లో తొలుత గ్రామానికి చెందిన బలిజపాళెం, కావలిపాళెం జట్లు పోటీ పడగా 8 ఓవర్లలోనే ఏడు వికెట్లు నష్ట పోయిన బలిజపాళెం జట్టు కేవలం 26 పరుగులు మాత్రమే చేసింది. అటు తరువాత బ్యాటింగ్‌కు దిగిన కావలిపాళెం జట్టు 4.2 ఓవర్లలో 29 పరుగులు చేసి విజయం సాధించింది. ఆ తరువాత జరిగిన మ్యాచ్‌లో పుట్టయ్య జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బలిజపాళెం జట్టు 9.5 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి కేవలం 57 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మరో మ్యాచ్‌లో కావలిపాళెం జట్టు నిర్ణీత ఓవర్లలో 55 పరుగులకు ఐదు వికెట్లు నష్టపోయింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన అల్లీపురం జట్టు 9.4 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ రోజు జరిగిన మ్యాచ్‌ల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకీ, అబిరాం, కే వెంకీ నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాచ్‌లను చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సీ నాగరాజు పర్యవేక్షించారు.

ఆడుదాం ఆంధ్ర కబడ్డీ విజేత కేసవరం



కబడ్డీ విజేత జట్టును అభినందిస్తున్న ఎంఈఓ, పీఈటీలు

కోట: ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి కబడ్డీ పోటీల్లో కేసవరం జట్టు విజేతగా నిలిచినట్లు ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకుమార్ తెలిపారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గూడలి జట్టుపై కేసవరం విజయం సాధించినట్లు తెలిపారు. విజేత జట్టు ఈ నెల 23 నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, పీఈటీలు వలీఅహ్మద్, సందానీ, కృష్ణ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పాలిచెర్ల జట్టు

గూడూరురూరల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గూడూరు మండలం పాలిచెర్ల సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. బుధవారం గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రూరల్ పరిధిలోని పాలిచెర్ల సచివాలయం జట్టు, పట్టణంలోని సత్రపువీధి సచివాలయం జట్లు తలపడ్డాయి. పాలిచెర్ల సచివాలయం జట్టు విజయం సాధించి మండలస్థాయి విజేతగా నిలిచింది.

ట్రావెల్ బస్సును ఢీకొన్న ఇన్నోవా



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలోని గుర్రప్పతోట గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సును ఇన్నోవా కారు ఢీకొనడంతో మార్టూరు సీఐ అక్కేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. అనంతపురం జిల్లా లేపాక్షిలో ఈనెల 14వ తేదీన జరిగిన ప్రధాని నరేంద్రమోదీ సమావేశానికి బందోబస్తు విధులకు వెళ్లిన అక్కేశ్వరరావు అక్కడి నుంచి తిరిగి బాపట్ల జిల్లా, మార్టూరుకు ఇన్నోవా కారులో బయలుదేరారు. మార్గం మధ్యలో గుర్రప్పతోట గ్రామం వద్ద విజయవాడ నుంచి బెంగళూరు వెళుతున్న ట్రావెల్ బస్సును ప్రమాదవశాత్తు కారు ఢీకొంది. ఈఘటనలో సీఐ అక్కేశ్వరరావు తీవ్రగాయాలయ్యాయి. కారు బ్యాటరీ సర్క్యూట్‌కు గురై మంటలు చెలరేగాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ప్రమాదాన్ని గుర్తించి నాయుడుపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసి గాయాలతో కారులో ఇరుకున్న సీఐని వెలికి తీసి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. స్వల్ప గాయాలతో బయటపడిన కారు డ్రైవర్ సర్దార్‌ను చికిత్సల కోసం నాయుడుపేటకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 8వ వార్డు ఎన్జీఓ కాలనీలో గురువారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు బుధవారం నేదురుమల్లి కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నాలని పిలుపు నిచ్చాయి.

కులగణనకు సహకరించండి

గూడూరురూరల్: పట్టణంలో ఈనెల 19 నుంచి వార్డు సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని, ఆ సమయంలో ఆయా కుటుంబ సభ్యుల వివరాలను వారికి తెలియజేసి, కుల గణన సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రణాళికలు రూపొందించండి

సైదాపురం: పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలను తయారు చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ పురుషోత్తం శివ కుమార్, ఈఓపీఆర్డీ ఇంద్రాణి పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

నాయుడుపేట: మండలంలోని మేనకూరులో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి, నలుగురిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సంక్రాంతి పండుగ సందర్భంగా మేనకూరులో కోడి పందేలు సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన వారు కోళ్ల పందాల స్థావరాలపై బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో జీ వెంకటేశ్వర్లు, వీ మునిరాజ, కే వీరాస్వామి, ఎస్ రమణయ్యను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మూడు పందెం కోళ్లు, రెండు కత్తులు, 3 సెల్‌ఫోన్‌లు, రూ.5500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమంతో ప్రతి ఇంటా సంక్రాంతి



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు నిండాయని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ వార్డు ఎన్‌జీఓ కాలనీ సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా నేదురుమల్లికి ఘన స్వాగతం పలికారు. అడుగు అడుగునా మహిళలు హారతులిచ్చి, నీరాజనం పలికారు. అనంతరం నేదురుమల్లి ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. నేదురుమల్లి మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 30 ఏళ్ల పాటు సీఎంగా ఉండేలా ప్రతి ఒక్కరూ దీవించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజాబలం ఉంటే ఏమైనా సాధించుకోవచ్చన్నారు. వెంకటగిరి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు వహీదా, నేతలు సీహెచ్ మురళి, యస్దానీ, కామాక్షయ్య, రమణమ్మ, శేఖర్, సుబ్రమణ్యం, మనీ, ప్రకాష్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి లేని లోటు తీరనిది

వెంకటగిరి రూరల్ మండలంలోని పెట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బీ వీరారెడ్డి మృతి తీరని లోటని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వీరారెడ్డి మృతి చెందారని విషయం తెలుసుకున్న ఆయన పెట్లూరు గ్రామానికి చేరుకున్నారు. వీరారెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, రాఘవరెడ్డి, దశరథరామిరెడ్డి ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటా....

వెంకటగిరిరూరల్: మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటానని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని ఆప్కాస్ ఎంప్లాయిస్‌కు గత 4 నెలల నుంచి వేతనాలు మంజూరు చేయడంలో జాప్యంపై మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. దీనిపై స్పందించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆప్కాస్ ఎంప్లాయిస్‌తో సంప్రదింపులు జరిపారు. దీంతో వారు సమ్మె విరమించారు.

పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రజనీకాంత్

ఓజిలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామసభల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని పున్నేపల్లె, ముమ్మాయపాళెం, మాచవరం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శేషమ్మ, సుజాత, ఈఓపీఆర్డీ మోహన్, ఏపీఎం నిర్మలమ్మ పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక : ఓజిలి మండలంలోని తిరుమలపూడిలో గురువారం నిర్వహించనున్న వికసిత్‌భారత్ సంకల్పయాత్ర గ్రామసభకు కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి దేవ్‌సింగ్ చౌహాన్ హాజరు కానున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై బూదనం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బూదనం గ్రామానికి చెందిన గిరి అనే వ్యక్తి సొంత పనుల నిమిత్తం మోటార్‌సైకిల్‌పై గూడూరుకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా బూదనం వద్ద ఉన్న మలుపు తిరిగే సమయంలో నాయుడుపేట వైపు నుంచి వేగంగా వస్తున్న కారు, బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్ నుజ్జునుజ్జు కాగా గిరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు అతనిని టోల్ ప్లాజా అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

నేడు గురునాథస్వామి గ్రామోత్సవం

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న యారా గురునాథస్వామి గ్రామోత్సవం ఐదు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మ తెలిపారు. ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉండే గురునాథస్వామి ఆలయంలోని స్వామివారికి సంక్రాంతి పండుగ అనంతరం గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాన్ని గురువారం నుంచి మూడు రోజులు పాటు తూర్పు కనుపూరు, ఈదులవారిపాళెం, రావుల వారిపాళెం, పోసిన వారిపాళెం, కొమారవారిపాళెం గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టాలు గడప దాటాయ్!

కన్నపేగు పంచి..పెంచి..పెద్ద చేసిన తల్లులనే అవసాన దశలో బిడ్డలు వదిలివేస్తున్నారు. భుజాల మీద ఎత్తుకుని తిప్పి.. అంతా తామై చూసుకుని, కష్టపడి పెంచితే వృద్ధాప్యంలో వారిని వదలి భార్యాబిడ్డలతో వలసబాట పడుతున్న కొడుకులను చూసి తల్లిదండ్రులు కుంగిపోతున్నారు. ఇలా ఎందరో అనాథలవుతున్నారు. వృద్ధాప్యంలో వారికి కావాల్సింది కాసింత తిండి..ఖర్చులకు కొంత నగదు..అయినా అది కూడా దొరక్క అల్లాడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందజేసి ఆదుకుంటోంది. ఆ పింఛన్ మొత్తం జనవరి నుంచి మరింత పెంచి.. వారి కష్టాలను గడప దాటించింది. పింఛన్ పెంపుపై ప్రత్యేక కథనం.

- అర్హతే ప్రామాణికంగా అందరికీ పింఛన్
- దొరవారిసత్రంలో కొత్తగా 66 పింఛన్లు మంజూరు
- పెరిగిన పింఛన్ అందజేత



వేణుంబాకంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య(ఫైల్)

దొరవారిసత్రం: గత పాలనలో పింఛన్‌దారులకు అన్ని అర్హతలున్నా తెలుగు తమ్ముళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అనంతరం జన్మభూమి కమిటీ సభ్యుల నుంచి ఆమోదం పొందాలి. ఒకవేళ పింఛన్ మంజూరైనా ఎప్పుడు ఇస్తారో తెలియని దుస్థితి. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తరువాత గత నాలుగేళ్లుగా అర్హతే ప్రమాణికంగా తీసుకుని, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నెల రోజుల వ్యవధిలోనే కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. ఒకటో తేదీ వేకువజామునే సూర్యుడి కంటే ముందే లబ్ధిదారుల తలుపు తట్టి నగదు అందిస్తోంది. ఈ జనవరి నుంచి ఆ మొత్తం మరింత పెంచి, నెలకు రూ.3 వేలు అందిస్తోంది. దొరవారిసత్రం మండలంలో వివిధ కేటగిరిల్లో కొత్తగా 66 పింఛన్లు మంజూరు చేసంది. దీంతో మొత్తం పింఛన్లు 5,031 మందికి అందుతున్నాయి.

నాడు 3,619...నేడు 5,031

దొరవారిసత్రం మండలంలో గత ప్రభుత్వంలో ఆరు రకాల కేటగిరిల్లో 3,619 మందికి మాత్రమే పింఛన్ అందించింది. వైఎస్సార్ సీపీ అధికారంలో వచ్చిన తరువాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి అందరకి పింఛన్ అందేలా చర్యలు చేపట్టింది. మళ్లీ ఈ నెలలో మరికొంత మందికి పింఛన్లు మంజూరు చేసింది. దీంతో ప్రస్తుతం 8 రకాల కేటగిరిల్లో 5,031 మందికి పింఛన్ నగదును లబ్ధిదారులకు అందుతోంది. గత పాలనలో వృద్ధాప్యం పింఛన్లు 2,788, దివ్యాంగులు 302, వితంతువులు 453, ఒంటరి మహిళ 42, అభయహస్తం 24, డీఎంహెచ్ఓ 10 మందికి పింఛన్ పంపిణీ చేశారు. జగనన్న అధికారంలో వచ్చిన తరువాత కుల, మత, పార్టీల కతీతంగా అర్హతే ప్రామాణికంగా వృద్ధాప్య పింఛన్లు 3,641, దివ్యాంగులు 433, వితంతువుల 732, ఒంటరి మహిళ 62, అభయహస్తం 18, డీఎంహెచ్ఓ(పక్షవాతం, రక్తహీనత, తలసేమియా బాధితులు) 29, డప్పు కళాకారులు 37, సంప్రదాయ కళాకారులు 13 మందికి నెలకు రూ.13,994,500 గత నెల వరకు పంపిణీ చేశారు. ఇవేకాకుండా డైయాలసిస్ బాధితులకు మరో పది మందికి ఒక్కొక్క లబ్ధిదారుకు నెలకు రూ.10 వేలు అంది స్తోంది. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

60 ఏళ్లు నిండిన వెంటనే...



నాకు 60 ఏళ్లు నిండిన వెంటనే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. వలంటీర్ విచారించి, దరఖాస్తును పంపారు. అధికారులు గ్రామంలోకి వచ్చి విచారణ జరిపి, కావాల్సిన పత్రాలు తీసుకుని వెళ్లారు. ఆ తరువాత కొన్నాళ్లకే వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. గతంలో నాకు రూ.2750 పింఛన్ వచ్చేది. ఈ నెల నాకు రూ.3 వేలు పింఛన్ ఇచ్చారు. ఈ మొత్తం నా జీవనానికి ఎంతో తోడ్పాటు అవుతుంది.

\- రెంటమల్లు చెంగయ్య, కారికాడు

ఎప్పటికప్పుడు విచారణ జరుపుతున్నాం



లబ్ధిదారులు పింఛన్ల మంజూరుకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సచివాలయం సిబ్బంది ఎప్పటికప్పుడు విచారణ జరుపుతున్నారు. అర్హత ఉంటే వెంటనే పింఛన్ మంజూరు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అన్ని అర్హతలుంటే నిర్ణీత వ్యవధిలో లబ్ధిదారులకు పింఛన్ మంజూరు అవుతోంది.

\- రఘురామయ్య, ఎంపీడీఓ, దొరవారిసత్రం

వెంటనే స్పందిస్తున్నాం



మా శాఖ పరంగా పింఛన్ దారులకు ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి, అన్ని విధాలుగా సహకరిస్తున్నాం. పింఛన్ల కోసం ఒంటరి మహిళ వంటి సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి విషయంలో ఆలస్యం లేకుండా వెంటనే స్పందించి విచారణ జరిపి, అర్హత ఉంటే వెంటనే సర్టిఫికెట్లు ఇస్తున్నాం. అలాగే రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తున్నాం.

\- గోపీనాథ్‌రెడ్డి, తహసీల్దార్, దొరవారిసత్రం